జిల్లా ఎస్‌పిని కలిసిన ఛాంబర్ ప్రతినిధులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో దుకాణాలు మూసివేసే సమయాన్ని గతంలో మాదిరిగా రాత్రి 11 గంటల వరకు పొడిగించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఛాంబర్ కార్యదర్శి కొమ్మూరు వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారులు నల్లాపవన్ కుమార్, ఉపాధ్యక్షులు మోకా వెంకట సుబ్బారావు, గోల్డ్ మార్కెట్ అధ్యక్షులు మేడిచర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వాన కష్టాలు

- నీట మునిగిన పంట పొలాలు
- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- స్తంభించిన జనజీవనం
- దెబ్బతిన్న రహదారులు


మెర్లపాలెం లో ముంపునకు గురైన వరిచేలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో గత కొద్ది రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంట పొలాలు, కూరగాయలు, పండ్ల తోటలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలకు నీట మునిగిని పొలాలను, దెబ్బతిన్న ప్రాంతాలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.

రామచంద్రపురం: భారీగా కురుస్తున్న వర్షాలతో మూడు రోజులుగా గోదావరిలో వరద నీటి ప్రవాహం పెరిగింది. కోటిపల్లి రేవులో వల్లనేటి ఉధృతికి మత్స్యకారులు చేపల వేట విరమించుకోగా, ఇక్కడ గల స్నాన ఘట్టాలు నీట మునిగాయి. రెండు రోజులుగా కోటిపల్లి రేవు బంద్ చేసి ప్రయాణాల నిలిపివేశారు. మరో రెండు రోజుల్లో వరద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఏటిగట్టు పరివాహక ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల్లో వరద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. **ఆత్రేయపురం:** భారీ వర్షాలకు ఉద్యానవన పంటలు మరియు వరి పంటలు, పల్లపు ప్రాంతాలు ముంపు నీటిలోని నానుతున్నాయి. ముంపు నీరు ముందుకు పోయే డ్రెయినేజీ వ్యవస్థ ఆక్రమణకు గురి కావడంతో ముంపు మీరు ముందుకు వెళ్లే దారి లేక వరి చేదు నీటిలో నానుతున్నాయి. పంట పొలాల్లోని నీటిని బయటకు మళ్ళించేందుకు రైతులు ప్రత్యామ్నాయ దారులు చూసుకుంటున్నారు. ఆత్రేయపురం, ఉచ్చిలి, మెర్లపాలెం, లొల్ల, ర్యాలీ, తదితర గ్రామాలలో వరిచేలు ముంపునీటిలో నానుతున్నాయి. కాలువలు నీటిమట్టం తగ్గించి వర్షం నీటిని మేజర్ డ్రయినేజీ నుంచి కాలువలలోకి మళ్లిస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో వాడపల్లి వెంకటేశ్వర స్వామి పుష్కర్ ఘాటుకు శనివారం వరద నీరు చేరింది. వాడపల్లి వెంకటేశ్వర ఆలయానికి వచ్చే యాత్రికులను గౌతమి గోదావరి నదిలో స్నానాలకు దిగకుండా ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ , ఆలయ పరిరక్షకులు శ్రీనివాస్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

కుండలేశ్వరం వద్ద కుంగిన ఏటిగట్టు

కాట్రేనికోన: భారీ వర్షాలకు మురమళ్ళ -పల్లంకురు ఏటిగట్టు కుండలేశ్వరం స్నాన ఘట్టం సమీపంలో మరింత బలహీనమై కుంగింది. భారీ వర్షాలకు ఏటిగట్టు బెర్మలు దిగబడ్డాయి. 100 మీటర్లకు పైగా ఏటిగట్టు బీటలు తీసింది. నాలుగు అడుగుల వరకు కిందకు దిగబడి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఏటి గట్టుపై ప్రయాణించే ప్రయాణికులుతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు పునర్నిర్మాణంలో భాగంగా అప్పటి అధికారులు, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల గట్టు దిగబడుతోందని హెడ్ వర్క్స్ ఎఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇకనైనా ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ సపోర్టింగ్ వాల్ నిర్మాణం చేపట్టవలసి ఉందని, ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించామని ఎఇ తెలిపారు.

కుంగిన ఏటిగట్టుకు రక్షణ కల్పించాలి:కలెక్టర్

మండల పరిధిలోని కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు కుంగిన ఏటి గట్టు (రక్షణ గోడ)ను తాత్కాలికంగా గ్రావెల్ తో నింపి రక్షణ కల్పించాలని జలవనుల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని కుండలేశ్వరం వద్ద కుంగిన రక్షణ గట్టు పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురమళ్ల-పల్లంకూరు రక్షణ గట్టు కుండలే శ్వరం వద్ద కుంగుతోందన్నారు. దీని రక్షణకై తాత్కాలిక పద్ధతిన గ్రావెల్ వేసి గట్టు కుంగిపోకుండా చర్యలు తీసుకోవాలని జలవనుల శాఖ అధికారులను ఆదేశించారు. మురమళ్ల నుంచి పల్లంకుర్రు వచ్చేందుకు దగ్గర దారి కావడంతో భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయని ట్రాఫిక్ రద్దీ వల్ల కుండలేశ్వరం వద్ద ఏటి గట్టు బీటలు తీసి కుంగడంతో రక్షణకై జలవనుల శాఖ అధికారులు తగు చర్యలు చేపడతారన్నారు. అదేవిధంగా శాశ్వత ప్రాతిపదికన రక్షణకై రివిట్‌మెంట్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని జల వనరుల శాఖ ఇంజనీర్లను కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న కాలువ గట్ల రోడ్ల రక్షణ దృష్ట్యా భారీ వాహనాలు తిరగకుండా గడ్డర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ వర్క్స్ డివిజ నల్ ఇంజినీర్ కెవివి.సుబ్బారావు, జూనియర్ ఇంజినీర్ ఈశ్వర్ మన్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: ఎంఎల్‌ఎ బండారు

ఆలమూరు: భారీ వర్షాలతో నష్టాల పాలైన రైతుల్ని ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని పెనికేరు, మోదుకూరు, గుమ్మిలేరు, ఆలమూరు గ్రామాల పరిధిలో ముంపునకు గురైన పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వెంట రాగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టనష్టాలను తెలుసుకొని భరోసా అందించారు. ముంపు నీరు పంట పొలాల నుంచి బయటకు వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏర్పడిన నష్టాన్ని వచ్చే శాసనసభ సమావేశాల సందర్భంగా సిఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. వర్షాల వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది గనుక ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ లక్ష్మి లావణ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. **కొత్తపేట:** భారీ వర్షాలకు కొత్తపేట మండలం అవిడి మార్కెట్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్న ఇల్లు పై కప్పు ఒకసారిగా కూలిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఆ ప్రాంతానికి చేరుకుని ఇల్లు కూలి నిరాశ్రయులైన వీరమళ్ళ బుర్రయ్య, పాముల పల్లాలమ్మ, పాముల యేసు, పాముల చిన్న సత్యనారాయణ, గణిపూడి పెద్దకాపు నాలుగు కుటుంబాల వారిని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే తక్షణసాయంగా నాలుగు కుటుంబాల వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమం రెడ్డి రామకృష్ణ, సురవరపు రామకృష్ణ, రెడ్డి తాతాజీ, అయిరెడ్డి రామారావు గ్రామ పెద్దలు , కూటమి నాయకులు పాల్గొన్నారు. అవిడి గ్రామంలో అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాలను ఎంఎల్‌ఎ బండారు పరిశీలించారు. వెంటనే ముంపు తొలగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ముంపుకుగురైన పంట పొలాల పరిశీలన

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, పరిధిలో ముంపునకు గురైన పంట పొలాలను శుక్రవారం ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఎ వేగుళ్ల వెంట జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పుచ్చల శ్రీనివాస్, మత్స గంగరాజు తదితరులు, పాల్గొన్నారు.


కుండలేశ్వరం వద్ద ఏటి గట్టు కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్


అవిడిలో నిరాశ్రయులైన బాధితులున పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ బండారు


కోటిపల్లి రేవు వద్ద మునిగిన స్నాన ఘట్టాలు


పడమర ఖండ్రిక వద్ద ముంపులోని పొలాలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

యువతకు ఉద్యోగాల కల్పన: మంత్రి సుభాష్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజక వర్గంలో యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటా అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్ స్పష్టం చేశారు. ఆయన శనివారం విఎస్‌ఎం కళాశాల్లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో పాల్గొని ప్రసంగించారు. ముందుగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌తో కలసి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు గత ప్రభుత్వం జాబ్ మేళా నిర్వహించ లేదన్నారు. జాబ్ మేళా లో ఉద్యోగం రాని యువకులు నిరాశ పడవద్దన్నారు. అందరికి ఉద్యోగాలు ఇప్పించే భాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తారని తెలియజేశారు. కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిర్వహించడం గొప్ప విషయమన్నాయరు. ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. సుమారు 36 కంపెనీలు పాల్గొన్న కార్యక్రమంలో జనసేన నాయకులు పోలిశెట్టి చంద్ర శేఖర్, టిడిపి నాయకులు రాఘవన్, కళాశాల కరస్పాండెంట్ మూర్తి, ఆర్‌డిఒ సుధాసాగర్, తహశీల్దార్ ఎం. వెంకటేశ్వర రావు హాజరయ్యారు. సుమారు 3000 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆగ్రహంతోనే వైసిపికి 11 సీట్లు

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఆగ్రహంతో వైసిపిని ఓడించారని అందుకనే ఆ పార్టీకి 11 సీట్లు వచ్చేయని మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక విఎస్ ఎం కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఎం చంద్రబాబు మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో గల 29 వేల ఫ్యాక్టరీల్లోను, ఆస్పత్రిలోనూ బాయిలర్లలోను ఉద్యోగాలు అన్వేషించి వాటిని నిరుద్యోగులకు ఎంపిక చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను అయిదేళ్లగా పట్టించుకోలేదన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

పట్టణంలోని విఎస్‌ఎం కళాశాల్లో శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్లను మంత్రి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

23న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఆర్‌టిసి డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈనెల 23న మంగళవారం 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నాయరు. ప్రయాణికులు తమ సలహాలు సూచనలను 9959225576 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు. అమలాపురం డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)ఆధ్వర్యంలో జూలై 21న అమలాపురం ప్రకాశం వీధిలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉభయ సంఘాల జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు ఎస్ఎఫ్ఐ కె.శంకర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంటివి.సుబ్బారావు, పి.వెంకటేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు అవగాహన కార్యక్రమం చేపడతామని మూఢనమ్మకాలు వ్యతిరేకంగా విద్యార్థులలో అభ్యుదయ భావాలను పెంపొందించేందుకు సైన్స్ ఆధారిత సమాజం నిర్మించే ప్రయత్నంలో భాగంగా సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్‌పై అవగాహన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వివిద రకాల కాంటేషన్స్‌ను నిర్వహిస్తామని తెలిపారు. మెజీషియన్ శ్యామ్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో వివిధ పాఠశాలు కళాశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి సహకరించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రాంమోహన్, హాజరవుతున్నారని తెలిపారు.

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి-అమలాపురం

గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ అమలాపురం కలెక్టరేట్ నుంచి ఇతర జిల్లా అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరద సన్నద్ధతపై సమీక్షించారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి వద్ద మాత్రమే నాలుగు లంక గ్రామాలు మెయిన్ లాండ్ తో సంబంధాలు తెగిపోయాయని, జిల్లాలో ఇంకెక్కడ ఇటువంటి సమస్య లేదని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా లో విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.. విద్యుత్ సమస్యలను అధికారుల దష్టికి తీసుకురావడానికి 24 గంటలు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ 9490610101 ను అందుబాటులో ఉంచామన్నారు. మండల ప్రత్యేక అధికారులందరూ ఇతర మండల అధికారుల సమన్వయంతో వరదల పై మండల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి వరదల కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెసి నుపూర్ అజయ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'కేర్'లో పేగు మడత శస్త్ర చికిత్స విజయవంతం


రోగికి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యనిపుణులు(ఇన్‌సెట్)లో డాక్టర్ కె.రవితేజ

ప్రజాశక్తి అమలాపురం

పట్టణంలో కోనసీమ కేర్ ఆసుపత్రిలో శనివార పేగు మడతకి డాక్టర్ కారెం రవితేజ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. సిగ్మోడి వాల్వులస్ వైద్యభాషలో పిలవబడే ఈ ఆపరేషన్ కోల్‌కత్తాకి చెందిన పిటి.సమీర్ అనే వ్యక్తికి చేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆపరేషన్‌ను పూర్తి చేశారు. రోగి బంధువులు డాక్టర్ కారెం రవితేజకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

'బ్యాంక్ ఆఫ్ బరోడా' ఖాతాదారులకు మెరుగైన సేవలు

కొత్తపేట బ్రాంచ్ లో 117వ ఫౌండేషన్ డే వేడుక

ప్రజాశక్తి-కొత్తపేట

బ్యాంక్ ఆఫ్ బరోడా రాష్ట్రంలోనే ఖాతాదారులకు మెరుగైరన సేవలు అందించడంలో ముందంజలో ఉందని కొత్తపేటలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కొత్తపేట బ్రాంచ్‌లో 117వ ఫౌండేషన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కేకును కట్ చేసి స్వీట్ బాక్సు కేకును కస్టమర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఆఫ్ బరోడా సామాన్యుని సైతం అందుబాటులో లోన్స్ అందించడంలో ముందడుగులో ఉన్నామన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రాసెసింగ్ చార్జీలు లేకుండానే గోల్డ్‌లోన్ అతి తక్కువ సమయంలో అతి తక్కువ వడ్డీ రేటుకే ఎక్కువ అమౌంట్ బ్యాంక్ ఆప్ బరోడా ద్వారా అందిస్తామన్నారు. మీ విలువైన వస్తువులను భద్రపరుచుకునేందుకు లాకర్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు అసిస్టెంట్ మేనేజర్ శివరాం, క్యాషియర్ కెవి.సత్య నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మందేశ్వరస్వామి ఆదాయం రూ.లక్షా 15 వేలు

ప్రజాశక్తి-కొత్తపేట


కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ప్రతి శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు తైలాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తైలాభిషేకములు టిక్కెట్ల రూపేనా రూ 92030, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.23193 మొత్తం రూ.1,15,223లు ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ కె.విజయ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

'నీట్'లో 696 మార్కులు సాధించిన సత్య శ్రీ

ప్రజాశక్తికపిలేశ్వరపురం

నీట్ 2024 లో జరిగిన ప్రవేశ పరీక్షలో టేకి గ్రామానికి చెందిన మేడిశెట్టి సత్య శ్రీ 720 మార్కులకు గాను 696 మార్కులు సాధించింది .ఆల్ ఇండియా ర్యాంకు 2504 కాగా ఆల్ ఇండియా ఒబిసి ర్యాంకు 870 సాధించింది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు జె.మల్లికార్జునుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు తదితరులు సత్యశ్రీని, ఆమె తల్లిదండ్రులు మేడిశెట్టి లక్ష్మీనారాయణ, నర్సి కుమారి దంపతులను సన్మానించారు.

కార్టూ'నిజం'



గల్ఫ్ బాధితుని కుటుంబానికి పరామర్శ


బాధితుడి కుటుంబ సభ్యులతో టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-అంబాజీపేట

విజిట్ వీసాతో మోసపోయి ఎడారిలో అనారోగ్యంతో అవస్థలు పడుతున్న బాధితుడి కుటుంబ సభ్యులను మండల టిడిపి శ్రేణులు శనివారం పరామర్శించారు. జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సరేళ్ళ వీరేంద్ర కుమార్ తనను ఇండియాకు రప్పించండంటూ, తాను మోసపోయానంటూ. సెల్ఫీ వీడియో లో ప్రాధేయ పడుతున్న సంఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇవి.. అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సరేళ్ళ వీరేంద్ర కుమార్ తల్లిదండ్రులు సరెళ్ల మరియమ్మ, సత్తిరాజులు వ్యవసాయ కూలీలు.. సోదరుడు రవికుమార్ పి.గన్నవరంలో ప్రయివేటు ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. అయితే కుటుంబ పోషణ, మరియు ఉండడానికి ఇళ్లు కట్టుకోవాలనే తపనతో వీరేంద్రకుమార్ గల్ఫ్ వెళ్లాలనుకున్నాడు. తన గ్రామానికి చెందిన ఒక ఆమె ఏజెంట్ ద్వారా ఇంట్లో వంట పని అని చెప్పి రూ.లక్షా70 వేలు తీసుకుని ఈనెల 10 న ఖత్తర్ పంపారని బాధితుడు వీరేంద్రకుమార్ తెలిపారు. తీరా అక్కడుకు వెళ్ళగా సౌదీ అరేబియాకు తీసుకువెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా వదిలిపెట్టి మోసం చేశారని వాపోయాడు. తిండి, నీరు లేక అలమట్టిస్తూ రక్తపు వాంతులతో తన ఆరోగ్యం క్షీణించిందని ప్రభుత్వం తిరిగి స్వదేశానికి తీసుకు రావాలంటూ మిత్రులకు సెల్ఫీ వీడియో ద్వారా తెలియపరిచాడు. ఈ వీడియో సోషల్ మీడియా, ట్విట్టర్లలో ప్రచారం కావడంతో ఏపి మంత్రి నారా లోకేష్ స్పందించి అతనిని ఇంటికి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనారోగ్యంతో తన కుమారుడిని త్వరగా తన దేశానికి రప్పించాలంటూ కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విన్నవించారు. బాధితుడి కుటుంబ సభ్యులను కలిసిన వారిలో టిడిపి కోకన్వీనర్ డివివి. సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, బొంతు పెదబాబు, జివి.రాఘవులు, అయ్యగారి సూరిబాబు, పెదపూడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బాధితుడు వీరేంద్రకుమార్‌ను మంత్రి లోకేష్ స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తున్నారని ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులకు వారు భరోసా కల్పించారు.

డ్రెయిన్లను ఆధునికీకరించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ముంపు నీరు దిగే డ్రెయిన్లను ఆధునికీకరించాలని సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబుతో పాటు సభ్యులు అధికారులను కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముంపు వర్షాలకు చేలల్లో నీరు దిగక నారుమడులు కుళ్లు పోయే పరిస్థితి ఏర్పడిందని, యుద్ధ ప్రాతిపదికన డ్రయిన్లను ఆధునికీకరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రం అమలు చేస్తున్న అగ్నివీర్ వాయు పథకంలో భాగమైన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగ దరఖాస్తులకు అభ్యర్థుల నుంచి స్వీకరిస్తునట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఇ.వసంతలక్ష్మి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్లైన్లో దరఖాస్తులకు ఈ నెల 28వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. అవి వాహితులైన పురుషుల తోపాటు మహిళా అభ్యర్థులు కూడా అర్హులే నన్నారు. అభ్యర్థుల వయోపరిమితి 21 ఏళ్ల లోపు ఉండాలని, గణి తం, ఫిజిక్స్, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో 50శాతం మార్కుల ఉత్తీర్ణతతో ఇంటర్,ఇంజినీరింగ్, డిప్లొమా,తత్సమానమైన విద్యార్హత ఉండాలన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


కిట్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అమలాపురం ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో శనివారం సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల ఎంఎల్‌ఎ ఆనందరావు విద్యార్థులకు అందజేశారు. ఎంఎల్‌ఎ గా మొదటిసారి పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఆనందరావును మండల విద్యాశాఖ అధికారులు కె.కిరణ్ బాబు,ఎస్.సత్యకృష్ణ సర్పంచ్ రాజ్ కుమార్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి నాగులపల్లి శేష వేణి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర గ్రామానికి చెందిన సున్నా నరేష్ (38) హత్య కేసులో ఐయిదుగురు నిందితులను శనివారం అంగర పోలీసులు అరెస్టు చేశారు. అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను మండపేట రూరల్ సిఐ శ్రీధర్ వెల్లడించారు. గ్రామానికి చెందిన నరేష్ మతిస్థిమితం లేక గ్రామస్తులతో తరచూ గొడవలు పడుతుండేవాడు. తన నివాస సమీపంలోని నిందితుడైన గుత్తుల పోతురాజు తండ్రితో నరేష్ గొడవ పడ్డాడు. దీంతో ఆగ్రహం చెందిన పోతురాజు మిగిలిన నలుగురు నిందితులైన నెల్లి శ్రీను, కోనాల రాంబాబు, మాతా శ్రీను, దాయం రాంబాబులు సాయంతో ఈ నెల 15న నరేష్‌ను సెంట్రింగ్‌రాడ్, కర్రలతో కొట్టి చంపారు. మరుసటి రోజు చనిపోయి ఉన్న నరేష్ మతదేహానికి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలో ఐయిదుగురు నిందితులపై హత్య కేసు నమోదు చేసి ఆలమూరు జె ఫస్ట్‌సిఎం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ శ్రీధర్, అంగర ఎస్‌ఐ వరదేశ్ తెలిపారు. పోలీసులకు సమాచారం తెలపకుండా అంత్యక్రియలు నిర్వహించిన బంధువులపై కూడా కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో శనివారం ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో పేకాట శిబిరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఉచ్చిలి గ్రామ శివారున పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెంలో కూల్ డ్రింక్ సీసా బద్దలు కొట్టి ఒకరిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సౌత్ జోన్ డిఎస్‌పి ప్రసాద్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన ముంజేటి సురేష్ మద్యం తాగిన బాటిల్‌ను సెంటర్లో రోడ్డుపై పగలగొట్టడంతో అక్కడ ఉన్న పెద్దలు వారించారు. దీంతో ధనంజయ రాజుపై సురేష్ దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితునిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు సిఐ మురళీధర్ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

ఒక వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కడియం సిఐ తెలిపారు. కడియం గ్రామానికి చెందిన చల్లా కొండరాజు అదే గ్రామానికి చెందిన ఒక వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమె భర్తపై దాడి చేసినట్లు వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు చల్లా కొండరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకరపాలెం చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఇబి ఎస్‌ఐ ఎం.రామస్వామి తెలిపారు. వారి వద్ద నుంచి 13 లీటర్ల మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.




వృక్షాన్ని నరికిస్తున్న పోలీసులు

నేల కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి - కోటనందూరు

గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షం, ఈదురుగాలులకు తుని-నర్సీపట్నం ప్రధాన రహదారిలో భారీ వృక్షం కూలిపోయింది. దీంతో తుని - నర్సీపట్నం మధ్య వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్ఐ బి.శంకర్రావు తన సిబ్బందితో భారీ వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



చెక్కును అందిస్తున్న నాయకులు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

గత ఏడాది అక్టోబర్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన జార్జిపేట గ్రామానికి చెందిన పిల్ల సాయి వెంకట నాగబాబుకు రూ.30 వేల ఇన్సూరెన్స్ చెక్కును కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ శనివారం అందజేశారు. రోడ్డు ప్రమాదం లో గాయ పడిన నాగబాబు జనసేన క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరుపున రూ.30 వేల ఇన్సూరెన్స్ చెక్ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కర్నేడి నాని, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబురావు, సూరంపూడి కుమార్ పాల్గొన్నారు.

కంటిపూడి కుటుంబ సభ్యులకు జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కంటిపూడి రామారావు తల్లి బంగారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం పెద్ద కార్యం సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై బంగారమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం వారి కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కూర్పు సాయితేజ, మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వేలమాటి కాశి, బలంరెడ్డి రామకృష్ణ, సంకపల్లి రమేష్, ఇప్పర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కరప



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నానాజీ

ఆరోగ్యం, అధిక వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ పంతం నానాజీ సూచించారు. శనివారం కరప మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేద్దామని అన్నారు. తాను ఆలస్యంగా ఎంఎల్ఏగా ఎన్నికైనా 30 ఏళ్లుగా రాజకీయాల్లోనే ఉన్నానని, ప్రజా సమస్యలపై తనకు అవగాహన ఉందని పార్టీలకు అతీతంగా అధికారులను ఇతర నాయకుల్ని గౌరవిస్తూ మండల అభికృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తొలుత వైద్య ఆరోగ్య, డ్రెయినేజీ, ఇరిగేషన్ తదితర శాఖలపై సమీక్షించారు. మండలంలోని అన్ని మేజర్ డ్రెయిన్ల మెయింటినెన్స్ ఒకే వ్యక్తికి కాంట్రాక్టు ఇవ్వడం వలన డ్రెయిన్లలో గుర్రపు డెక్క తూటు తొలగించడం లేదని, పైపైన మందు పిచికారి చేసి పోతున్నారని సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆదే కాంట్రాక్టర్ టెండరు దాఖలు చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.అప్పారావు, వైస్ ఎంపిపి బొమ్మెతి వీరరాఘవులు, సర్పంచులు డేగల లలిత కుమారి, మారెళ్ళ శ్రీనివాసరావు, గోపి సత్యవేణి, అడబాల సత్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాయుడుకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ



పురస్కారాన్ని అందుకుంటున్న ఆదిత్య డైరెక్టర్ నాయుడు

ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు ఇండియన్ రెడ్‌క్రాస్ అవార్డును కలెక్టర్ షాన్‌మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉత్తమ సేవా పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలలో ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఉత్తమ సేవలను అందించడంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పురస్కారాన్ని నాయుడుకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డిగ్రీ కళాశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ వింగ్స్ ద్వారా రక్తదానం, ప్రథమ చికిత్స, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మెళుకువలు వంటి అనేక సామాజిక కార్యకలాపాలను విద్యార్థులకు తెలియజేస్తూ, వారిని సామాజిక బాధ్యత గల వ్యక్తులుగా మార్చేలా చేసిందని అన్నారు. డాక్టర్ నాయుడును ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల ప్రిన్సిపల్స్, ఐఆర్‌సిఎస్ నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, శాఖాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

డాక్టరేట్ అందుకున్న ప్రత్యూష

ప్రజాశక్తి - గండేపల్లి



డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రత్యూష

మండలంలోని మురారి గ్రామానికి చెందిన చంద్రాల ప్రత్యూష గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంది. శనివారం హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీలో నిర్వహిం చిన గ్రాడ్యుయేషన్ సెర్మనీలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. విశాఖలోని గీతం వర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఇవల్యూషన్ ఆఫ్ ఎఫిసెంట్ ఆర్కిటెక్చర్ ఫర్ ఒన్ డైమెన్షనల్, టూ డైమెన్షనల్ ఫైన్ఇట్ ఇంపల్స్ ఫిల్టర్స్' అంశంపై ఆమె పిహెచ్‌డీ చేశారు. గీతం వర్సిటీకి చెందిన గైడ్ డాక్టర్ జేబీ సెవెంత్ లిన్ సారథ్యంలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ ప్రత్యూష హైదరాబాద్‌లోని సుమేధా ఐటీ సంస్థలో వీఎల్ఎస్ఐ డిజైన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఆమె గతంలో విశాఖలోని సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ, హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు, విఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేశారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

మండలంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శ్యాంసుందర్ తెలిపారు శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని పి.వేమవరం, నవర, చంద్రంపాలెం, ఉండూరు, అచ్చంపేట, గొంచాల, వికె.రాయపురం, మాధవపట్నం, జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే ఈ శిబిరాల్లో సరి చేయించుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉషారణి తెలిపారు. ఈ క్యాంపుల్లో ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్సు, వయసు తదితర మార్పులు, చేర్పులు చేస్తారని చెప్పారు. 23, 24 తేదీల్లో వడ్లమూరు జడ్‌పి హైస్కూల్లో వడ్లబమూరు, జి.రాగంపేట, గోరింట, పులిమేరు గ్రామాలకు, కాండ్రకోట జడ్‌పి హైస్కూల్‌లో తూర్పు పాకలు, మరలావ, కాండ్రకోట గ్రామాలకు, కొండపల్లి జడ్‌పి హైస్కూల్లో ఆనూరు, కొండపల్లి గ్రామాలకు, 25న చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్లో దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామాలకు, 25, 26 తేదీల్లో కట్టమూరు జడ్‌పి హైస్కూల్‌లో కట్టమూరు గ్రామానికి, 25న ఆర్‌బి పట్నం జడ్‌పి హైస్కూల్లో చిన్న బ్రహ్మదేవం, వాలు తిమ్మాపురం, ఆర్ బి పట్నం గ్రామాలకు, 27న చదవాడ జడ్‌పి హైస్కూల్లో ఉలిమేశ్వరం, చదలాడ, తాటిపర్తి గ్రామాలకు, జె తిమ్మాపురం ఎంపి యుపి స్కూల్లో జె.తిమ్మాపురం గ్రామానికి, ఆర్ బి కొత్తూరు ఎంపి యుపి స్కూల్లో ఆర్‌బి కొత్తూరు గ్రామానికి సంబంధించి ఈ క్యాంపులు నిర్వహించబడతాయన్నారు.

చదరంగం క్రీడను నేర్పేలా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రతీ పాఠశాలలోనూ విద్యార్థులకు చదరంగం క్రీడను నేర్పేలా చర్యలు చేపట్టాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యాన ప్రముఖ చదరంగ క్రీడాకారులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, రాధాకృష్ణ లను సత్కరించారు. ఈ సందర్భంగా డా అడ్డాల మాట్లాడుతూ మన భారతీయ ప్రాచీన క్రీడ చదరంగాన్ని ప్రతీ పాఠశాలలో పిల్లలందరికీ తప్పనిసరిగా నేర్పాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ లయన్ అనురాధాకృష్ణ, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, అనిల్, శిరీష, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకోవటానికి జాగ్రత్తలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంటపై ప్రభావం లేకుండా జాగ్రత్తలు అవసరమని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.దయాకర్ అన్నారు. శనివారం మండలంలో వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో విత్తనం చల్లిన 2, 3 రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలని అన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే తక్షణమే పూర్తిగా నీటిని తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహారావు, ఎఎస్ఆర్.శర్మ, సిహెచ్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, విఎఎ ఎస్.నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దాదాపు 30 ఏళ్ళ పైబడి ఎన్ఎఫ్‌సిఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులకు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ కోరారు. శనివారం ఆయన కార్మికులతో కలిసి ఎంఎల్ఎ పంతం నానాజీని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి శివకోటి రాజు, ఎన్ఎఫ్‌సిఎల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాలా రమణ, టి.శ్రీను, కమిటీ సభ్యులు కాపు, వి.రమణ, ఈశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఐఐటీలో ప్రతిభ చాటిన నవోదయ విద్యార్థి

ప్రజాశక్తి - యానాం



ఆకాష్

యానాం జవహర్ నవోదయ విద్యార్థి యు.ఆకాష్ ప్రతిష్టాత్మకమైన ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఎరోస్పేస్ కోర్సులో ఎంపికైనట్లు యానాం నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డి శనివారం తెలిపారు. ఆకాష్ 22-23 విద్యా -సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని పొందడమే కాకుండా రెండు సంవత్సరాలు బెంగళూర్‌లోగల దక్షిణా ఫౌండేషన్‌లో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో విద్యనభ్యసించినట్లు తెలిపారు. ఆకాష్ ఐఐటిలో సీటు సాధించి నవోదయ యానాంకు పేరు తేవడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆకాష్ తండ్రి యు.జయప్రకాష్ స్థానిక నవోదయలో గణిత ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. ఆకాష్ మాట్లాడుతూ తనకు ఇష్టమైన ఏరోస్పేస్ కోర్సులో సీటు రావడం ఆనందాన్ని కలిగించిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

టిడ్కో గృహ రుణ మాఫీపై అసెంబ్లీలో చర్చిస్తా

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడ్కో గృహ రుణాల మాఫీపై అసెంబ్లీలో చర్చించి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం స్థానిక వాలు తిమ్మాపురం టిడ్కో గృహ సముదాయంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి పాలనలో టిడ్కో గృహాలను నిర్మించినా, మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులు పి.మణి, ఎ. శ్రీదేవి, నాగమణి, ఎస్.మణి తదితరులు మాట్లాడుతూ గృహ రుణాల వాయిదాలను చెల్లించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని, వాయిదాల కోంస బ్యాంకుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందన్నారు. దీనిపై ఎంఎల్ఏ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, టిడిపి నాయకులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పోలమర శెట్టి సత్తిబాబు,ఒ బిలిశెట్టి గణేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, డిఇఇ ఆదినారాయణ పాల్గొన్నారు.

పవన్‌కు మద్దతుగా సభ్యత్వం తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్ర రాజకీయాల్లో నూతన ఒరవడిని సృష్టిస్తున్న పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా తటస్తులు కూడా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందాలని విశ్రాంతి ఇంజనీర్ పి.పార్థసారథి సూచించారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందిన పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాలకు దూరంగా ఉన్న తాను నిస్వార్థంగా సేవలు అందించడానికి కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ ఆశయాలకు మద్దతుగా నిలవడానికి సభ్యత్వం స్వీకరించానని అన్నారు. జనసేన పార్టీ నగర శాఖ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో మూడోరోజు పెద్ద ఎత్తున యువకులు, తటస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

బాలయోగి ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

ముమ్మిడివరం భగవాన్ బాలయోగిశ్వరుల ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేసేందుకు కృషి చేస్తానని అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బాలయోగిశ్వరుల ఆశ్రమాన్ని శనివారం ఎంపిగా గెలిచిన హరీష్ మాధుర్ తొలిసారి సందర్శించి బాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకున్నారు. కార్యక్రమానికి ముందు ఆశ్రమ కమిటి మరియు కుటుంబ సభ్యులు ఎంపి హరీష్ కు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమం మరియు ఆశ్రమానికి వెళ్ళే రహదారులను ఎంపి ల్యాడ్స్ నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, కాశి రామచంద్ర రావు, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులతోనే రేవుల వద్ద పంట్లు, పడవలు నడపాలి

ప్రజాశక్తి-అమలాపురం

పక్కా అనుమతుల తోనే రేవుల వద్ద పంట్లు, పడవలు నడపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లాలో వివిధ రేవుల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.. జిల్లా లో అధికారికంగా అనధికారికంగా 13 రేవుల వద్ద పంట్లు, పడవలు నడుపుతున్నారని అధికారులు కలెక్టర్ దృష్టి కి తీసుకొచ్చారు. కలెక్టర్ ఆర్‌మహేష్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం రేవుల నిర్వహణ జాయింట్ కమిటీల ఆధ్వర్యంలో జరగాలని ఆదేశించారు.. వారం రోజుల్లోగా జాయింట్ కమిటీలు లేని రేవులకు జాయింట్ కమిటీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

మండలాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయసమావేశ మందిరంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఏ పాల్గొని మాట్లాడారు. సమస్యలపై పలు గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

నీటమునిగిన నారుమళ్ల పరిశీలన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు-2 రైతు సేవ కేంద్రంలో అమలాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నందకిశోర్, మార్టేరు ప్రిన్సిపల్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ.కృష్ణాజి, డాక్టర్ డయాల్, డాక్టర్ ఆనంద్ కుమార్, డిఆర్‌సి ఎఒ మనోహర్, మండల ఎఒ కె. ప్రవీణ్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఆదర్శ రైతులతో సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం కాట్రేనికోన -3 వేట్ల పాలెం గ్రామము నందు నీట మునిగిన వరి నారుమడులు, నాట్లు వేసిన రైతులు పొలాలను శాస్త్రవేత్తలు సందర్శించారు. ఊడ్చిన వెంటనే మరియు పిలక దశలో ముంపునకు గురి అయినట్లైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్ గా వేసుకోవాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో ఆకుపై 2 శాతం యూరియా లేదా పోటాషియం నైట్రేట్ ను పిచికారి చేయుటవలన పైరు త్వరగా పుంజుకుంటుందన్నారు. కార్యక్రమంలో విఎస్‌కె మనోజ్, రైతులు పితాని సత్యనారాయణ, ఒలేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారికి ఇన్సూరెన్స్ అందజేత

ప్రజాశక్తి -అమలాపురం

ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు కొత్తపేట ఇంచార్జీ బండారు శ్రీనివాస్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని శనివారం అందించారు. అమలాపురం రూరల్ మండలం జనుపల్లి గ్రామానికి చెందిన గునిశెట్టి వరప్రసాద్ రూ.19 వేలు, చిందాడగరువు గ్రామానికి చెందిన మండేల సూర్యప్రకాశరావుకు రూ.30వేలు, పేరూరు పంచాయతీ తోట్లపాలెంకు చెందిన దొంగా వీర సాయికుమార్ రూ.25,013 బీమా చెక్కులను అందించారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ నాయకులు నల్లా శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ళ సతీష్, రూరల్ అధ్యక్షులు లింగోలు పండు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కొత్తపేట

వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ మృతి చెందిన జగత శ్రీనివాసరావుకు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఘనంగా నివాళులర్పించారు. సుదీర్ఘకాలంగా ఆస్పత్రిలో సహాయకునిగా పనిచేస్తున్న శ్రీనివాసరావ గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు,సిబ్బంది శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మధుకర్, స్థానిక ఆసుపత్రి వైద్యులు, స్టాఫ్ నర్సులు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో కళాశాల బస్సు బోల్తా

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఓడలరేవు బివిసి ఇంజినీరింగ్ కళాశాల నుండి విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని శనివారం సాయంత్రం తిరిగి వెళుతున్న బస్సు సరిపల్లి గ్రామం వచ్చేటప్పటికి స్టీరింగ్ రాడ్ విరిగిపోయి పంట కాలువలోకి బోల్తా పడింది.ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ఆరుగురు విద్యార్థులను గ్రామస్తులు అద్దాలు పగలగొట్టి క్షేమంగా బయటకు తీశారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయటపడ్డారు. జిల్లావ్యాప్తంగా తుఫాను ప్రభావంతో శనివారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి విద్యాసంస్థలను నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థి ప్రజా సంఘాలు మండిపడ్డాయి.దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

కబడ్డీ పోటీలకు కిట్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఇ 3వ ఏడాది చదువుతున్న కె. మనోహర్ జూనియర్ ఇండియా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కర్నూలులో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన మనోహర్ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం హైదరబాదులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ ఇండియా కబడ్డీ ప్రాపబుల్స్‌కు ఎపి తరపున ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌ను కళాశాల ఛైర్మన్ బేతినిడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సర్వరామేశ్వరుడు, ఇఒ జెన్నీబాబు,పెద్ద కాపు, పిడి స్వామి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



చెరువును తలపిస్తున్న రహదారి

రహదారికి మోక్షం ఎప్పుడు..?

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గోతులతో చెరువులను మరిపిస్తున్న ఏలేశ్వరం - జె. అన్నవరం ఆర్‌అండ్‌బి రహదారికి మోక్షం ఎప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకుంది. ఏజెన్సీ ముఖ ద్వారమైన ఏలేశ్వరానికి నిత్యం వందలాది వాహనాలు గిరిజన ప్రాంతాల నుంచి ఇదే రహదారిలో వస్తుంటారు. గతంలో ఏలేశ్వరం సంతకు గురువారం వందలాది మంది గిరిజన, గిరిజనేతరులు ఏలేశ్వరం వచ్చేవారు. ఈ రహదారి శిథిలావస్థకు చేరడంతో దూరాభారమైన గోకవరం మీద నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సివస్తుంది. దీంతో ఏలేశ్వ రంలో వ్యాపారాలు 90 శాతం పైగా తగ్గిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇదే రహదారిపై ప్రయాణించే అంబులెన్సులు సైతం మరమ్మతులు గురై నిలిచిపోయేవి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతన్నారు.

సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా బోధన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా బోధన మార్పు చెందాలని దాని కోసం ఉపాధ్యాయులు మరింత నైపుణ్యాన్ని పెంచుకోవాలని డిఇఒ కమల కుమారి అన్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు హైస్కూల్లో జరుగుతున్న టీచ్ బుల్ అబ్జర్వర్ ట్రయినింగ్ ప్రోగ్రాం శనివారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి మధుసూదన్ రావు పాల్గొన్నారు. డివైఇఒ ఎస్.నరసింహ ఫణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ తొమ్మిది రోజులపాటు కొనసాగు తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి రాంబాబు, ఎంఇఒ మనపూడి శ్రీనివాసు, ఎంఇఒ-2 నాగేశ్వరి, మాస్టర్ ట్రయినర్ చొప్పెల్ల వెంకన్న బాబు, చక్రవర్తి, రాజు, మూర్తి సాయి సుధా తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చింతలూరుకు చెందిన యువకుడు వీరి మురళీకృష్ణ(24) ఇటీవల తన స్నేహితులతో కలిసి మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను దర్శించడానికి వెళ్లాడు. అయితే లోయర్ సీలేరు ప్రాజెక్టు ఫోర్ బె పవర్ కెనాల్లో (పుష్పబ్రిడ్జి వద్ద) ప్రమాదవశాత్తు జారిపడి అతను మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎంఎల్ఏ బండారు సత్యానందరావు శనివారం పార్టీ శ్రేణులతో విచ్చేసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళీకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఏ బండారు సత్యానందరావు వెంట టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.